

అందమే ఆనందం..!

అందానికి ఎవరు ఎన్ని అలంకారాలు ఇచ్చినా, ఉపమానాలు చూపినా అందమే ఆనందం అంటున్నారు మహిళలు.

- 8లో



త్రుటిలో తప్పిన ప్రమాదం

మెంటాడ మండలం కుంటినవలసలో రెండవ అంగన్‌వాడీ కేంద్రం శ్లాబ్ పెచ్చులు రాలాయి. చిన్నారులకు త్రుటిలో ప్రమాదం తప్పింది.

- 8లో

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: విజయనగరం ఫూల్‌బాగ్‌లో ఉన్న ప్రభుత్వ అంధుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో వివిధ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.మహేశ్వరరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు 39 ఖాళీలకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. వివరాలకు సెల్ నంబర్లు: 83175 48039, 7989592141ను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

తరచూ అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విమలరాణి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ విమలరాణి

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలను తరచుగా పర్యవేక్షించాలని సీడీపీఓలకు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విమలరాణి సూచించారు. విజయనగరం ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలు సంపూర్ణంగా అందేలా చూడాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతలో అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రథమ కోఆర్డినేటర్ రమణ పాల్గొన్నారు.

సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళికలు రూపొందించాలి

- విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సంయుక్త సలహాదారు ఎస్.ప్రకాష్



మాట్లాడుతున్న విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సంయుక్త సలహాదారు ప్రకాష్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఎదురయ్యే విపత్తులపై సన్నద్ధమయ్యేలా ప్రతిశాఖ సమగ్ర ప్రణాళిక రూపొందించి రాష్ట్ర విపత్తుల శాఖకు పంపాలని విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సంయుక్త సలహాదారు ఎస్.ప్రకాష్ కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విపత్తుల నిర్వహణపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతోనే విపత్తుల నుంచి గట్టెక్కడం సాధ్యమన్నారు. ప్రకృతి వైపరీత్యాలపై రియల్ టైం హెచ్చరికల వ్యవస్థలో సచేత్ యాప్ కీలకమని, దీనిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో విపత్తుల శాఖ కార్యదర్శి అభిషేక్ బిస్వాస్, సీనియర్ కన్సల్టెంట్ అభినవ్ వాలియ, డీఆర్వో శ్రీనివాసమూర్తి, అదనపు ఎస్పీ సౌమ్యలత, ఆర్డీఓ సవరమ్మ, డీపీఎం రాజేశ్వరి, సీపీఓ పి.బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


కొత్త మరువాడలో ఏనుగుల గుంపు

- భయాందోళనలో రైతులు, ప్రజలు



వంగర మండలం కొత్త మరువాడ సమీపంలో ఏనుగుల గుంపు

వంగర: మండలంలోని కొత్త మరువాడ గ్రామ పంటపొలాల్లోకి మంగళవారం అర్ధరాత్రి తర్వాత ఏనుగుల గుంపు చేరింది. ప్రస్తుతం గ్రామ సమీపంలోని బోడికొండ వద్ద సంచరిస్తున్నాయి. రైతులు ఒంటరిగా పొలాల్లోకి వెళ్లవద్దని, ఏనుగులను కవ్వించవద్దని అటవీశాఖ సిబ్బందితో పాటు వీఆర్‌ఓ ఈశ్వరరావు, వీఆర్‌ఏ భూలోక గ్రామస్తులను అప్రమత్తం చేశారు. సీతాదేవిపురం, కింజంగి గ్రామాల వైపు ఏనుగులు వెళ్లే అవకాశం ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలకు సమాచారం చేరవేశారు.



0 సున్నా వడ్డీ లేనట్లేనా..?

వ్యవసాయం అంటేనే పెట్టుబడితో కూడిన వ్యవహారం. దీనికోసం రైతులు బ్యాంకుల్లో విరివిగా రుణాలు తీసుకుంటారు. పంట చేతికొచ్చాక తిరిగి చెల్లిస్తారు. వీరికి గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సున్నావడ్డీని వర్తింపజేసేది. చెల్లించిన వడ్డీ డబ్బులను రాయితీ కింద తిరిగి రైతుల ఖాతాలకు జమచేసేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సున్నావడ్డీ నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకులకు వెళ్లి పదేపదే వడ్డీ రాయితీ డబ్బుల కోసం ఆరాతీస్తూ నిరాశతో వెనుదిరుగుతున్నారు.

- కూటమి ప్రభుత్వం వచ్చాక సున్నావడ్డీ ఊసెత్తని వైనం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సున్నా వడ్డీ కింద రూ 25.36 కోట్లు అందజేత
- 2024-25 ఖరీఫ్‌లో పంట రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య: 1,81,493
- రుణాల మొత్తం రూ.2,639 కోట్లు



పొలం దుక్కిచేస్తున్న రైతు

విజయనగరం ఫోర్ట్:

'గంట్యాడ మండలం పెదవేమలి గ్రామానికి చెందిన డి.అప్పలసత్యం 2024లో బ్యాంకులో పంట రుణం కింద రూ.40వేలు తీసుకున్నారు. దానికి వడ్డీ రూ.4,100 కావడంతో బ్యాంకుకు వెళ్లి కట్టేశారు. వడ్డీరాయితీ (సున్నా వడ్డీ)ని ప్రభుత్వం విడుదల చేయలేదా అని బ్యాంకు అధికారులను అడిగితే రాలేదని తెలిపారు.'

అదే మండలానికి చెందిన పి.బైరాగి 2024లో పంట రుణం కింద రూ.40 వేలు తీసుకున్నారు. వడ్డీ రాయితీ కోసం బ్యాంకు వెళ్లి అడగడంతో బ్యాంకు అధికారులు వడ్డీ రాయితీ లేదని చెప్పడంతో వడ్డీ రూ.3,500 కట్టేశారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక కష్టాలు మొదలయ్యాయన్న మాట రైతుల నుంచి వినిపిస్తోంది. గతేడాది పెట్టుబడి సాయం అందజేయలేదు. ఈ ఏడాది ఖరీఫ్ పనులు ఆసన్నమైనా అన్నదాత సుఖీభవ నిధులు విడుదల ఊసెత్తడంలేదు. మరోవైపు తీసుకున్న రుణాలకు వడ్డీ రాయితీ వర్తింపజేయకపోవంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యమిచ్చేదని, రైతన్నకు అండగా నిలిచేదని, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని చెబుతున్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు వడ్డీభారం భరించాల్సి వస్తోందని వాపోతున్నారు. మరోవైపు ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడడంతో రైతులే ప్రీమియం చెల్లించాల్సిన దుస్థితి. లేదంటే విపత్తుల సమయంలో పరిహారం అందని పరిస్థితి.

గత ప్రభుత్వం రూ.25.36 కోట్లు అందజేత..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద సాయంతో పాటు రైతులకు వడ్డీ రాయితీ కింద కోట్లాది రూపాయలు అందించింది. సున్నావడ్డీ కింద రైతన్నల ఖాతాలకు రూ.25.36 కోట్లు జమచేసింది. 2019 ఖరీఫ్‌లో సున్నావడ్డీ కింద రూ.3కోట్లు, 2019 రబీలో 2.54 కోట్లు అందజేసింది. అలాగే, 2020 ఖరీఫ్‌లో రూ.5 కోట్లు, రబీలోరూ.1.31 కోట్లు, 2021 ఖరీఫ్‌లో రూ.5,24 కోట్లు, రబీలో 2.19 కోట్లు, 2022 ఖరీఫ్‌లో రుణాలు తీసుకున్న రైతులకు రూ.6.07 కోట్లు వడ్డీ రాయితీ అందజేసింది.

రుణాల మంజూరు ఇలా..

2024-25 ఖరీఫ్ సీజన్‌లో పంట రుణాల లక్ష్యం రూ.2,650 కోట్లు కాగా 1,81,493 మంది రైతులకు వివిధ బ్యాంకులు రూ.2,639 కోట్లు పంట రుణాలు మంజూరు చేశాయి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు పంట రుణాలపై అందించే వడ్డీ రాయితీ (సున్నా వడ్డీ) చెల్లించలేదు. రైతులు పంట రుణాలకు అయ్యే వడ్డీని కట్టుకోవాల్సిన పరిస్థితి. ఇది భారం అయినా బ్యాంకుల ఒత్తిడి మేరకు వడ్డీతో రైతులు రుణాలు చెల్లిస్తున్నారు.

ఆత్మీయ కలయిక

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన పార్టీ రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకుల సమావేశం అనంతరం జరిగిన కలయికలో విజయనగరం జిల్లాలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని పార్టీ అధినేత సూచించినట్టు జెడ్పీ చైర్మన్ ఫోన్‌లో తెలిపారు. -విజయనగరం



వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మజ్జి శ్రీనివాసరావు

కొత్తవలస కేజీబీవీలో అగ్నిప్రమాదం

- కాలిబూడిదైన 280 పరుపులు, 79 మంది విద్యార్థుల అభ్యసన సామగ్రి
- సురక్షితంగా బయటపడిన 270 మంది బాలికలు
- విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న స్థానిక నాయకులు



పై అంతస్తులో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కొత్తవలస:

మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ శివారు అడ్డూరువానిపాలెం వద్ద గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో విశాఖపట్నానికి చెందిన రోటరీ క్లబ్ సంస్థ వారు బాలికలకు వితరణగా మంగళవారం అందజేసిన 280 పరుపులు, ఇంటర్మీడియట్ విద్యార్థులు 79 మందికి చెందిన అభ్యసన సామగ్రి కాలిబూడిదయ్యాయి. కాలకృత్యాలు తీర్చుకునేందుకు లేచిన ఇద్దరు బాలికలు ప్రమాదాన్ని గుర్తించి అందరినీ అప్రమత్తం చేశారు. వెంటనే బాలికలందరూ భవనం నుంచి బయటకు పరుగుతీశారు. విద్యాలయం సిబ్బంది అందించిన సమాచారం మేరకు కొత్తవలస, ఎస్.కోట అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. పై అంతస్తులో ప్రమాదం కావడంతో మంటలు అదుపుచేయడం కష్టమైంది. ఉదయం 7 గంటలకు మంటలు అదుపులోకి వచ్చాయి. బాలికలకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఎస్‌ఓ విజయకుమారితో పాటు బాలికల తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. కొందరు తల్లిదండ్రులు పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు.

విద్యాలయాన్ని సందర్శించిన పీఓ

ప్రమాద వార్త తెలిసిన వెంటనే సర్వశిక్షా అభియాన్ పీఓ డాక్టర్ అవగడ్డ రామారావు విద్యాలయానికి చేరుకున్నారు. ప్రమాదం తీరును ఎస్‌ఓ, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీఈఓ మాణిక్యం నాయుడు సందర్శించి విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. కాలిపోయిన అభ్యసన సామగ్రి, ఇతర వస్తువులు కొనుగోలుకు రూ.2లక్షలు మంజూరు చేసినట్లు పీఓ రామారావు తెలిపారు.

సహాయక చర్యలు

ప్రమాద స్థలాన్ని కొత్తవలస మండల పరిషత్ మాజీ అధ్యక్షులు గొరపల్లి శివ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్యరామాస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు చెల్లయ్యలు పరిశీలించారు. పాఠశాలకు 20 మంది పారిశుద్ధ్య కార్మికులు, ఎలక్ట్రికల్ సిబ్బందిని పంపించి సహాయక చర్యలు అందించారు.

పారదర్శకంగా విధులు నిర్వహించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.శ్రీను

సాక్షి ఎఫెక్ట్...

బొబ్బిలి: వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా విధులు నిర్వహించాలని బొబ్బిలి తహసీల్దార్ ఎం.శ్రీను సూచించారు. మ్యుటేషన్లలో అక్రమాలపై 'మ్యుటేషన్‌కు రూ.30 వేలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. భూములు ఆన్‌లైన్ వ్యవహారాలు చేసేటప్పుడు ఆ విధానాలు అందుబాటులో ఉన్నాయా? లేవా? అని తెలుసుకోవాలన్నారు. ఏదేని మ్యుటేషన్ పనులు జరిగినప్పుడు తన దృష్టికి తీసుకురావాలన్నారు. తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఇటీవల మండలంలో జరుగుతున్న, జరిగిన ఆన్‌లైన్ వ్యవహారాలపై ఆరా తీశారు. సమావేశం, నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

ఇంటెలిజెన్స్ ఆరా!

'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీశాయి. సంబంధిత ఉద్యోగులు మండలంలోని వీఆర్వోల తీరుతెన్నులపై ఉన్నతాధికారులకు సమాచారమందించినట్టు తెలిసింది. అసలు ఈ వ్యవహారంపై ముందుగానే ఆ అధికారులకు సమాచారం ఉంది. ఈ వ్యవహారంపై అధికారులకు నివేదించే పనిలో సిబ్బంది ఉన్నారని తెలిసింది. రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు కూడా భూముల ఆన్‌లైన్ వ్యవహారాలపై విచారణకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం.



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

27 నుంచి మొహర్రం ఉత్సవాలు

విజయనగరం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27 నుంచి జూలై 7వ తేదీ వరకు పవిత్ర మొహర్రం ఉత్సవాలు నిర్వహిస్తామని జిల్లాశాఖ ముస్లింల ప్రతినిధి మహమ్మద్ గౌస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు జిల్లాలో ఉన్న సున్నీ మసీదుల్లో 11 రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. ముస్లిం సోదరులందరూ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

- కలెక్టర్ అంబేడ్కర్



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

విజయనగరం అర్బన్: అధికారులంతా చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులకు సూచించారు. జూన్ 25తో కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకొని ఏడాది పూర్తయిన సందర్భంగా జేసీ సేతు మాధవన్, జిల్లా అధికారులు, రెవెన్యూ సంఘం సభ్యులు, పలువురు పాత్రికేయులు కలెక్టర్‌ను కలిసి అభినందించారు. డీఆర్‌ఓ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు, జిల్లా అధికారులు కలెక్టర్‌తో కేక్ కట్ చేసి దుశ్శాలువలు కప్పి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, సీపీఓ పి.బాలాజీతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డు సాధించాలి

గ్రామీణస్థాయిలో పరిశుభ్రతకు అందించనున్న స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2025 అవార్డుకు ప్రతి మండలం నుంచి రెండు గ్రామ పంచాయతీలు పోటీపడేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2025పై వెబెక్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో 37 పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దామని, కేంద్ర బృందం వస్తున్న వేళ పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డీపీఓ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన వీఆర్‌ఏలు

విజయనగరం గంటస్తంభం: వేతనాలు పెంచాలని, పే స్కేల్, డీఏ వర్తింపజేయాలంటూ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) విజయనగరం కలెక్టరేట్‌ను బుధవారం ముట్టడించారు. సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా నినాదాలు చేశారు. అటెండర్లుగా, స్వీపర్లుగా, డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా అదనపు పనిభారం మోపడాన్ని తప్పుబట్టారు. కేవలం నెలకు రూ.11వేలు వేతనంతో ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తంచేశారు. అర్హులైన వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణా రాష్ట్ర అమలుచేస్తున్న పే స్కేల్‌ను వర్తింపజేయాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి, జిల్లా గౌరవాధ్యక్షుడు బి.సూర్యనారాయణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ప్రసాద్, పైడిరాజు, సన్యాసప్పుడు, రామప్పుడు, జయరావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



వీఆర్‌ఏ డిమాండ్లు పరిష్కారించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద వీఆర్‌ఏల నిరసన

రక్తికడుతున్న జిందాల్ డ్రామా!

- ఓ వైపు జిందాల్ కంపెనీ ఏర్పాటు చేయాలని..
- మరోవైపు న్యాయం చేయాలంటూ వేర్వేరుగా శిబిరాల నిర్వహణ
- తాజాగా చదునుచేసే పనులతో నిర్వాసితుల్లో ఆందోళన



అడ్డతీగ వద్ద నిర్వాసితులు నిర్వహిస్తున్న నిరసన శిబిరం



కంపెనీలు రావాలంటూ జిందాల్‌కు మద్దతుగా కూటమి ప్రతినిధులు నిర్వహిస్తున్న శిబిరం

శృంగవరపుకోట: ఓ వైపు జిందాల్ కర్మాగారం కావాలంటూ స్థానికులతో సంబంధం లేనివారు శిబిరం నిర్వహణ... మరోవైపు తమకు తమ పిల్లలకు ఉద్యోగ భరోసా, పరిహారం చెల్లింపులో న్యాయం చేసి పరిశ్రమ ఏర్పాటు చేయాలంటూ నిర్వాసితుల ఆందోళన... సమస్యపై స్పందించని అధికార యంత్రాంగం వెరసి 'జిందాల్' నాటకాన్ని ఎవరికి వారే రక్తికట్టిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శిబిరాల హైడ్రామాను చూసి స్థానికులు మండిపడుతున్నారు. ప్రాణాలు పోతుంటే పీక్కుతినే రాబంధుల మాదిరిగా జిందాల్ నిర్వాసితులపై రాజకీయ రాబంధులు వాలిపోతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎవరికి తగ్గట్లు వారు నాటకీయంగా డైలాగులు చెబుతూ హైడ్రామా నడిపించడంపై ఆవేదన చెందుతున్నారు. జిందాల్ యాజమాన్యం రైతుల నుంచి తీసుకున్న భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కులు పెడతామన్న ప్రతిపాదన ప్రస్తుతం నిర్వాసితుల్లో అలజడి రేపుతోంది. గతంలో జిందాల్ చేసిన ఒప్పందాలను ఎలా అమలు చేస్తారు? ఎవరు అమలు చేస్తారు.? ఉద్యోగాలు, పరిహారం, జీవన భృతి మాటేమిటంటూ రోడ్డెక్కారు. నిర్వాసితులకు సరైన హామీ ఇచ్చాకే ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభించాలని ఎమ్మెల్సీ రఘురాజు కూటమి ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు.

చెట్ల తొలగింపుపై ఆందోళన

పోలీస్ బందోబస్తు నడుమ బందవలస వద్ద జిందాల్‌కు చెందని భూముల్లో పాతికేళ్ల వయస్సున్న మామిడి తోటలను బుధవారం జిందాల్ దౌర్జన్యంగా తొలగించిందంటూ నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. జిందాల్‌కు సంబంధం లేని భూములు కూడా లాక్కుందామని చూస్తున్నారని గిరిజన మహిళలు, రైతులు స్థానిక నాయకుల వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. 1960లో తాటిపూడి నుంచి తగిలేసి నిర్వాసితుల్ని చేశారని, ఇప్పుడు భూములు లాక్కుని పొమ్మంటున్నారంటూ జిందాల్ సమస్య విచారణకు వచ్చిన అధికారి కరుణాకరణ్ ఎదుట రైతులు వాపోయారు.

మా భూములు మాకివ్వాలి..

2013 భూహక్కు చట్టం ప్రకారం జిందాల్ యాజమాన్యం కంపెనీ ఏర్పాటు చేయనందున తమ భూములు తమకు ఇవ్వాలని కోరుతూ కొత్త అడ్డతీగ కూడలి వద్ద నిర్వాసితులు బుధవారం నిరసన శిబిరం ప్రారంభించారు. వీరికి సీపీఎం, గిరిజన సంఘాలు మద్దతు తెలిపాయి. మరోవైపు కంపెనీ కావాలంటూ కూటమి వర్గీయులు కొందరు మరో శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. రాజకీయ పార్టీలు అటు, ఇటు వత్తాసు పలుకుతుండడంతో న్యాయం జరుగుతుందా? లేదా? అన్న సంకట స్థితిలో నిర్వాసితులు కొట్టుమిట్టాడుతున్నారు.

స్నేహం కుదిరిన వేళ..

చిత్రం చూశారా... ఇదేంటి నక్క, కుక్కలు కలిసి ఉన్నాయని ఆశ్చర్యపోతున్నారా!. ఇది నిజమే.. మారుతున్న పరిస్థితులతో జంతువుల్లోనూ మార్పు కనిపిస్తున్నట్టు ఉంది. సంతకవిటి మండలం కాకరాపల్లి గ్రామ సమీపంలోని ఓ పౌల్ట్రీ వద్ద కుక్కలతో ఓ నక్క స్నేహం చేస్తోంది. కుక్కలతో కలిసి రాత్రీపగలు తిరుగుతోంది. ఈ దృశ్యాన్ని చూసిన వారు.. కాలం మారిందంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. కుక్కలను చూడగానే పరుగులు తీసే నక్క వాటితోనే స్నేహం చేయడం చూసి ఆశ్చర్యపోతున్నారు. - రాజాం



పిల్లలు లేని ఫౌండేషన్ స్కూల్!



బోధించేందుకు టీచర్ ఉన్నారు. కానీ పాఠాలు వినేందుకు ఒక్క విద్యార్థి కూడా లేరు. ఇది సంతకవిటి మండలం గుజ్జన్నపేట ప్రాథమిక పాఠశాల దుస్థితి. దీనిని కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఫౌండేషన్ స్కూల్‌గా మార్పుచేసి ఇక్కడ కొనసాగే 3, 4, 5 తరగతులను చిత్తారిపురం యూపీ స్కూల్‌లో విలీనం చేసింది. ఇప్పటివరకు ఇక్కడ రెండో తరగతి చదువుతున్న ఒకే ఒక విద్యార్థి కూడా ప్రస్తుతం పాఠశాలకు రావడం లేదు. కొత్తగా ఒకటి రెండు తరగతుల్లో విద్యార్థులు ఎవరూ చేరలేదు. అంతే... టీచర్ ఎస్.నారాయణమ్మ విధులకు సమయానికి హాజరుకావడం, వెళ్లిపోవడమే జరుగుతోంది. విద్యాశాఖాధికారులు స్పందించి ఫౌండేషన్ స్కూల్‌ను రద్దుచేసి, ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఏం చేస్తారో వేచిచూడాల్సిందే.

- సంతకవిటి

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం

• అంగన్వాడీ కేంద్రం శ్లాబ్‌కు ఊడిన పెచ్చులు



పెచ్చులూడిన అంగన్వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ హైమావతి

మెంటాడ: మండలంలోని కుంటినవలసలో రెండవ అంగన్వాడీ కేంద్రం శ్లాబ్ పెచ్చులు రాలడం ఆందోళన కలిగించింది. బుధవారం కేంద్రంలో 17 మంది పిల్లలు ఉన్నారు. అప్పుడే వచ్చిన ఆ గ్రామ యువతిపై ఆ పెచ్చులు పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలిసిన అంగన్వాడీ సూపర్‌వైజర్ హైమావతి వచ్చి ఆ పిల్లలను ఇళ్లకు పంపించారు. పిల్లలకు ఏమీకాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శిథిలావస్థకు చేరిన భవనం శ్లాబ్ కింద పిల్లలను ఉంచి కేంద్రాన్ని నడపడంపై పలువురు విమర్శలు చేసిన పట్టించుకోక పోవడం గమనార్హం.

కూలిన వైన్‌షాపు ముందుభాగం



కూలిపోయిన మద్యం దుకాణం ముందుభాగం

బొబ్బిలి: పట్టణంలోని మేదరి బంద వద్ద గల మద్యం దుకాణ భవనం శ్లాబ్ ముందుభాగం బుధవారం కూలిపోయింది. అదృష్టవశాత్తు మద్యం కొనుగోలుకు ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సమాచారం అందుకున్న ఎక్సైజ్ సీఐ పి.చిన్నం నాయుడు అక్కడికి వెళ్లి దుకాణం మూసివేయించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మద్యం దుకాణాన్ని మార్పు చేశాక తిరిగి తెరిచేందుకు అనుమతిస్తామని వ్యాపారులకు తెలియజేశారు.

గురుదేవాలో చోరీ కేసులో మరో ఇద్దరి అరెస్టు

• మిస్టరీగా చోరీ సొత్తు రికవరీ



కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో గత నెల 28వ తేదీన దొంగలు చొరబడి భారీ ఎత్తున బంగారం, నగదు దోచుకుపోయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే మహారాష్ట్రకు చెందిన పార్థిగ్యాంగ్‌లో ఒకరిని మహారాష్ట్ర వెళ్లి పట్టుకుని అరెస్టు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. కాగా ఇదే కేసులో మహారాష్ట్రలోని బుల్దాన్ జిల్లాకు చెందిన ముత్తుపవర్ అక్షయ్, లక్ష్మణ పవర్‌లను అరెస్టు చేసి కొత్తవలస కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సీఐ షణ్ముఖరావు బుధవారం తెలిపారు. కాగా ఇప్పటివరకు ఈ కేసులో కేవలం నిందితులను మాత్రమే పట్టుకుంటున్నట్లు పోలీసులు చూపుతున్నారే తప్ప ఎక్కడా చోరీకి గురైన సొత్తును రికవరీ చేస్తున్నట్లు చెప్పకపోవడం కొసమెరుపు. ఈ చోరీలో సుమారు 10కేజీల బంగారం,రూ 50లక్షలకు పైగా నగదు మాయమైనట్లు సమాచారం.

నేడు ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా బాల, బాలికల ఎంపిక పోటీలు ఈనెల 26న నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ముఖ్య శిక్షకుడు డీవీ.చారి ప్రసాద్ బుధవారం తెలిపారు. నగరంలోని విజ్జి స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి అండర్ -10, 12 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో అండర్-10 విభాగంలో 2016 జనవరి 1వ తేదీ అనంతరం, అండర్ -12 విభాగంలో 2014 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా స్పష్టం చేశారు. క్రీడాకారులు విధిగా ఫెన్సింగ్ అసోసియేషన్ గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 29వ తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని మరిన్ని వివరాలకు ఫోన్ 8374737707 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190



అందమే ఆనందం..!



విజయనగరం టౌన్: పెళ్లికుమార్తె ముస్తాబు చేస్తున్న బ్యూటీషియన్

• సౌందర్యానికి ప్రాధాన్యం ఇస్తున్న మహిళలు
• కాలానికి అనుగుణంగా మారుతున్న మహిళల తీరు
• ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్న సంస్థలు
• స్వయం ఉపాధికి మార్గం అంటున్న శిక్షకులు
• నేడు జాతీయ బ్యూటీషియన్ల దినోత్సవం

రాజాం సిటీ:/విజయనగరం టౌన్: అందానికి ఎవరు ఎన్ని అలంకారాలు ఇచ్చినా, ఉపమానాలు చూపినా అందమే ఆనందం అంటున్నారు మహిళలు. ఆ అందం వెనుక మరో మహిళ ఉండి ఆ అందానికే వన్నెతెస్తోంది. ఇంట్లో, వీధిలో, బంధువుల ఇళ్లల్లో జరిగే వేడుకల్లో ప్రత్యేకంగా కనిపించేందుకు మహిళలు శ్రద్ధ తీసుకుంటున్నారు. కిట్టీ పార్టీల నుంచి పెళ్లిళ్ల వరకు ఏ శుభకార్యమైనా అతివలదే సందడి. వేడుక ఏదైనా మేకప్ అదరాల్సిందే. వారి ఆశలకు అనుగుణంగానే పట్టణాల్లో బ్యూటీ పార్లర్లు కూడా విస్తరిస్తున్నాయి. అవుట్ డోర్ షూట్‌లు, పుట్టినరోజు, నిశ్చితార్థం ఇలా వేడుక ఏదైనా వనితకు ప్రత్యేకమే. ప్రతి శుభకార్యానికి ముందస్తు వేడుక ఇప్పుడో ట్రెండ్‌గా మారిపోయింది. అప్పటికప్పుడు పార్టీలకు వెళ్లేందుకు సైతం అభిరుచికి తగ్గట్టు మగువల అందానికి బ్యూటీషియన్లు మరింత వన్నె తెస్తున్నారు.

నేడు జాతీయ బ్యూటీషియన్ల దినోత్సవం

మహిళలు, విద్యార్థినులు సైతం అందానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లో ఉన్న పాశ్చాత్య ధోరణి ఇప్పుడు పల్లెలకు సైతం పాకింది. పట్టణాల్లో ఏర్పాటుచేసిన బ్యూటీ పార్లర్లు కూడా మగువల అభిరుచులకు తగ్గట్లు నిర్వహణ చేపడుతున్నారు. ఇదిలా ఉండగా కొద్దో గొప్పో బ్యూటీషియన్ కోర్సులు నేర్చుకున్న వారికి ఓ ఆదాయ వనరుగా కూడా కలిసొస్తోంది. ఇంటి వద్దే ఉంటూ నాలుగు డబ్బులు సంపాదించి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. పట్టణం నుంచి పల్లెల వరకు నేడు మహిళలు, చిన్నారులు సైతం అందంపైనే మక్కువ చూపుతున్నారు. ఇంట్లో చిన్న చిన్న వేడుకలతో పాటు పెళ్లిళ్ల సీజన్‌లో నిశ్చితార్థం మొదలుకుని ఫొటోషూట్, పెళ్లి తంతు ముగిసే వరకు మగువలు అందంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారితో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. బ్రైడల్ మేకప్, శారీ డ్రాపింగ్, కేశాలంకరణ ఇలా ఎక్కడా మేకప్ విషయంలో రాజీపడడంలేదు.



రాజాం సిటీ: నైరేడ్‌లో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఆదాయ వనరుగా..

బ్యూటీషియన్ కోర్సు చేసిన మహిళలకు ఇంటి వద్దే ఆదాయవనరుగా బ్యూటీ పార్లర్లు కలిసివస్తున్నాయి. ప్రతి నిత్యం ఐ బ్రో అందంగా తీర్చిదిద్దడంలో మెలకువలు పాటిస్తూ ఆదాయమార్గాలను అన్వేషిస్తున్నారు. మహిళల ఆసక్తిని, అభిరుచిని గమనించి బ్యూటీ పార్లర్లలో ప్రత్యేక అలంకరణ చేస్తున్నారు. సింగిల్ ప్యాకేజీ, హోమ్ సర్వీసెస్ ద్వారా మగువలు వారి అందాన్ని మరింత మెరుగుపరుచుకుంటున్నారు. శరీరతత్వం, మనిషిరంగు, వేడుకను బట్టి వారికి అమరేలా మేకప్ చేస్తున్నారు. మేకప్ రకం, వాడే మెటీరియల్ బట్టి పారితోషికం కూడా తీసుకుంటున్నారు. ఒక్కోసారి ఇళ్లకు తీసుకువెళ్లి మేకప్ చేయించుకునేందుకు బ్యూటీషియన్లతో ముందుగానే ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఇళ్లకు వెళ్లి మేకప్ చేసేందుకు సైతం మెటీరియల్‌కు అనుగుణంగా రూ.4 వేల నుంచి రూ.10వేల వరకు రేట్లు నిర్ణయించి ఆదాయం సంపాదిస్తున్నారు.



రాజాం సిటీ: మెలకువలు నేర్పుతున్న శిక్షకులు



విజయనగరం టౌన్: ఫేషియల్ చేస్తున్న దృశ్యం

శిక్షణతో ప్రోత్సహిస్తున్న సంస్థలు..

మహిళలకు ఉపాధిమార్గాలు చూపేందుకు శిక్షణ సంస్థలు కూడా బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నాయి. దీంతో మహిళలు కూడా ఆసక్తి కనబరిచి శిక్షణ పొందుతున్నారు. అలాగే బ్యూటీ పార్లర్లలో పనిచేసుకుంటూ చిన్నచిన్న చిట్కాలను, మెలకువలను సైతం నేర్చుకుంటూ సొంతంగా పార్లర్లను ఏర్పాటు చేసుకుంటూ తమ కాళ్లపై తాము నిలబడగలుగుతున్నారు.

21 వేల మంది వరకు శిక్షణ..

జీఎంఆర్ నైరెడ్ సంస్థ ద్వారా ఇప్పటివరకు వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 21432 మందికి బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ అందించాం. యువతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఇదో చక్కని అవకాశం. పదో తరగతి చదివి ఖాళీగా ఉన్నవారందరినీ ఉపాధిమార్గాలవైపు ప్రోత్సహిస్తున్నాం. ఇందులో భాగంగా అందిస్తున్న బ్యూటీషియన్ కోర్స్‌లో చేరి మెలకువలు తెలుసుకుంటున్నారు. సంస్థ స్థాపించిన తరువాత నిర్విరామంగా యువతకు ఉపాధి శిక్షణను ఉచితంగా అందిస్తున్నాం.

ఎం.రాజేష్, డైరెక్టర్, జీఎంఆర్ నైరేడ్, రాజాం.

విబా ద్వారా ఉచిత శిక్షణ



విజయనగరం బ్యూటీ అసోసియేషన్ ద్వారా ఆసక్తి ఉన్న మహిళలకు, యువతకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. మహిళలకు లబ్ధి చేకూర్చే బ్యూటీషియన్ కోర్సు నేర్చుకునేందుకు దూరప్రాంతాలకు వెళ్లేవారు. ఇప్పుడు అటువంటి వారందరూ విజయనగరం జిల్లా కేంద్రంలోనే శిక్షణ తీసుకునేందుకు అనువుగా విబా ఏర్పాటుచేశాం. అసోసియేషన్ ఇక్కడ ఉండడం వల్ల పెద్దపెద్ద బ్యూటీ కంపెనీలు ఉచిత తరగతులను అందించేందుకు ముందుకు వస్తుండడం ఆనందంగా ఉంది.

–బోని భాగ్యలక్ష్మి, వ్యవస్థాపక అధ్యక్షురాలు, విజయనగరం బ్యూటీషియన్స్ అసోసియేషన్, విజయనగరం.

స్వయం ఉపాధి దిశగా



బ్యూటీపార్లర్ అంటే పూర్వం ఒకరోజు మేకప్ అనుకునేవారు. ఫంక్షన్‌లకు మాత్రమే పార్లర్‌కి వెళ్లేవారు. కానీ ఇప్పుడు హెల్త్ కేర్ హెయిర్ నుంచి కాలి గోరు వరకూ పార్లర్‌లో లేటెస్ట్ ఎక్విప్‌మెంట్స్, కాస్మోటిక్ చాలా ఖరీదైన సర్వీస్ అందుబాటు లోకి వచ్చాయి. ప్రతిఒక్కరూ అందంగా ఉండడం ఆత్మవిశ్వాసంగా భావిస్తున్నారు. దానివల్ల బ్యూటీపార్లర్ అంటే ఒక చిన్న చూపు నుంచి స్వయం ఉపాధిగా మారింది. సంఘంలో గౌరవం కూడా పెరిగింది.

–జంపన అరుణ, జేకే. బ్యూటీ క్లినిక్, విజయనగరం

పోలీస్ వెల్ఫేర్ పాఠశాలలో టీచర్ పోస్టుల భర్తీ

• దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పోలీస్ వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోదలచిన అభ్యర్థులు తమ విద్యార్హతలతో పాటు, కచ్చితంగా ఆంగ్లంలో విద్యాబోధన చేయగలిగిన సామర్థ్యం ఉండాలని స్పష్టం చేశారు. ఉద్యోగ ఖాళీలు, విద్యార్హత వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయ ఉద్యోగం 1:
డీఈడీ లేదా బీఈడీ విద్యార్హతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి

2వ తరగతి కోసం సింగిల్ మదర్ టీచర్ ఉద్యోగం 1
సింగిల్ మదర్ టీచర్‌గా పని చేసేందుకు డీఈడీ, లేదా బీఈడీ అర్హతతో పాటు అన్ని సబ్జెక్టులను బోధించగలగాలి

3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు సబ్జెక్టును బోధించేందుకు ఉపాధ్యాయ ఉద్యోగం ఖాళీ 1
డీఈడీ లేదా బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలి

6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు గణితం బోధించేందుకు ఉపాధ్యాయ ఉద్యోగం ఖాళీ 1
బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలి



పోస్టుల భర్తీ వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఖాళీ 1
కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసేందుకు బీఎస్సీ లేదా బీకాం లేదా ఇతర కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన డిగ్రీ లేదా సర్టిఫికెట్ కోర్సులను అర్హతగా కలిగి ఉండాలి.

తోటమాలి ఖాళీ 1
పాఠశాలలో తోటమాలిగా పని చేసేందుకు ఆసక్తి కలిగిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చు

పైన తెలిపిన ఉద్యోగాలను భర్తీ కోసం ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీన ఉదయం 10గంటలకు విజయనగరం కంటోన్మెంట్ పోలీస్ క్వార్టర్స్ సమీపంలో గల పోలీస్ వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో జరిగే ఇంటర్వ్యూ, డెమో క్లాసులకు నేరుగా హాజరుకావచ్చని ఎస్పీ పేర్కొన్నారు. మరిన్ని వివరాలు, సందేహాల నివృత్తి కోసం స్కూల్ ఆఫీసు నంబర్లు 9441022874, 6305883484 లేదా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ 9121109485, వెల్ఫేర్ ఆర్ఎస్సై 9121109484 నంబర్లను సంప్రదించ వచ్చని ఎస్పీ వకుల్ జిందల్ సూచించారు.

జిల్లా వేదికగా జాతీయ చెస్‌పోటీలు

• ఈనెల 28 వరకు జరగనున్న దివ్యాంగుల జాతీయ చెస్ చాంపియన్‌షిప్
• పోటీలకు హాజరైన 16 రాష్ట్రాలకు చెందిన 150 మంది క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయి చెస్ పోటీలకు విజయనగరం వేదికగా నిలిచింది. ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం సారథ్యంలో నిర్వహించ తలపెట్టిన 5వ జాతీయ స్థాయి దివ్యాంగుల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని మెసానిక్ టెంపుల్‌లో నిర్వహిస్తున్న పోటీలను స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలు విజయనగరంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పోటీలకు వచ్చిన క్రీడాకారులను ఆమె అభినందించారు. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శి కేవీ జ్వాలాముఖి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలకు చెందిన 150 మంది దివ్యాంగ క్రీడాకారులు మంగళవారం జిల్లాకు చేరుకున్నారన్నారు. వారందరికీ మంగళవారం అన్ని రకాల మెడికల్ చెకప్ చేశామని చెప్పారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు అంతర్జాతీయ పోటీలకు వెళ్లనున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన దివ్యాంగ క్రీడాకారులు

ల్యాప్‌టాప్స్,సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్



దొంగలను పట్టుకున్న టూటౌన్ సీఐ శ్రీనివాస్, క్రైమ్ పార్టీ

విజయనగరం క్రైమ్ : సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను దొంగిలించిన కేసులో ఇద్దరు నిందితులను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని ఉదయరాజపాల్యంకు చెందిన మురుగన్ వెంకటస్వామి, గణేష్‌లను ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేశామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఉదయ రాజ పాల్యంకు చెందిన ఇద్దరు వ్యక్తులు నగరంలోని వీటీ అగ్రహారంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. నగరంలోని స్టూడెంట్స్ రూమ్స్ లక్ష్యంగా చేసుకుని ల్యాప్ టాప్‌లు, సెల్‌ఫోన్‌ల అపహరణకు పాల్పడేవారు. ఇలా విజయనగరంలోని కోటవీధి, కాటవీధి, విశాఖలోని పీఎంపాలెం వద్ద గల స్టూడెంట్స్ రూమ్ లలో దొంగతనాలకు పాల్పడ్డారు. అయితే ఈ నెల ఆరవ తేదీన విజయనగరంలోని శివాలయం వీధికి చెందిన ఓ వ్యక్తి ల్యాప్‌టాప్, రెండు సెల్‌ఫోన్‌లు పోయినట్లు ఫిర్యాదు చేయడంతో క్రైమ్ పార్టీని రంగంలోకి దించామని టూటౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.ఈ క్రమంలోనే స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించగా ఈ ఇద్దరు నిందితులు నేరం చేసినట్లు నిర్ధారణ అయిందన్నారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను అరెస్ట్ చేశామని వివరించారు. విచారణలో మొత్తం 57 సెల్ ఫోన్లు, 16 ల్యాప్‌టాప్‌లు, రెండు ఆపిల్ ఐ ప్యాడ్‌లు దొంగతనం చేసి అమ్మేసినట్లు నిందితులు అంగీకరించారని సీఐ చెప్పారు.

20 లీటర్ల సారా స్వాధీనం

పార్వతీపురం రూరల్: మండలంలోని వెలగవలసలో అక్రమంగా సారా విక్రయిస్తున్న బోడిపల్లి రాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విక్రయానికి సిద్ధంగా ఉంచిన 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి తెలిపారు. ఈ మేరకు పట్టుబడిన వ్యక్తిని, స్వాధీనం చేసుకున్న సారాను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతకు బైక్స్

• అత్యాధునిక టెక్నాలజీతో తయారీ
• జిల్లాకు వచ్చిన 16 బైక్స్

విజయనగరం క్రైమ్: జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రత కోసం కొత్తగా 16 మోటార్ సైకిల్స్ జిల్లా కేంద్రానికి వచ్చాయని ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. డీజీపీ ఆఫీస్ నుంచి జిల్లాకు వచ్చిన బైక్స్‌ను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆ బైక్స్‌ను ఉపయోగిస్తామన్నారు. వాటిలో 15 టీవీఎస్ అపాచీ మోటార్‌సైకిల్స్, ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ఉన్నాయని తెలిపారు. ఈ మోటార్ సైకిల్స్‌ను సైరన్, బ్లింకర్స్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, క్రౌడ్ కంట్రోల్ చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించారన్నారు. జిల్లాలో ట్రాఫిక్ అవాంతరాలు తరచూ ఏర్పడుతున్న పోలీస్‌స్టేషన్లకు అలాగే రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్న స్టేషన్లకు వాటిని కేటాయించనున్నామని తెలిపారు. ఫోర్‌వీలర్స్ వెళ్లలేని మారుమూల ప్రాంతాలకు కూడా ఈ మోటార్ సైకిల్స్ వినియోగించి, పోలీస్ సిబ్బంది, అధికారులు చేరుకునే అవకాశముంటుందన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రమాదాల నియంత్రణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎస్పీ వకుల్ జిందల్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్కే చౌదరి, ఆర్ఎస్సై(ఎంటీఓ) ఆర్.రమేష్ కుమార్, ఆర్ఎస్సై (అడ్మిన్) ఎస్.గోపాలనాయుడు పాల్గొన్నారు.



జిల్లాకు వచ్చిన మోటార్ సైకిల్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సంజీవకుమార్

సాక్షి ఎఫెక్ట్

పూసపాటిరేగ: పూసపాటిరేగ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సంజీవ కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. సాక్షి దినపత్రికలో 'తహసీల్దార్ ఎక్కడ?' శీర్షికన బుధవారం కథనం వెలువడింది. దీనిపై స్పందించిన రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు పూసపాటిరేగ డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సంజీవకుమార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. పదిరోజులుగా తహసీల్దార్ కార్యాలయంలో ఎటువంటి రెవెన్యూ సేవలు అందకపోవడంతో విద్యార్థులు, వివిధ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు తహసీల్దార్ బాధ్యతలు ఇన్‌చార్జికి అప్పగించడంతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం కానున్నాయి.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



ఘటనాస్థలంలో ప్రశాంతకుమార్ మృతదేహం




ప్రశాంత్ కుమార్ (ఫైల్)

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి వట్టిగెడ్డ పాత బ్రిడ్జి సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం జీగిరాం గ్రామానికి చెందిన నూలక ప్రశాంత కుమార్ (26) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఇది వరకే వివాహం జరిగి ఇద్దరు పిల్లలు ఉండగా భార్యతో విడాకులు తీసుకున్నాడు. తరువాత తల్లిదండ్రుల వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ప్రశాంత కుమార్ మరో అమ్మాయితో ప్రేమలో పడి ఆమెను ఇంటికి తీసుకొస్తానని తల్లిదండ్రులతో చెప్పగా వద్దని మందలించారు. దీంతో ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి బ్యాగ్‌తో వెళ్లిపోయి కొట్టక్కి బ్రిడ్జి వద్ద తన షర్ట్‌తో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు పరిసర ప్రాంతాలతో పాటు బంధువుల గ్రామాల్లో కూడా వాకబు చేశారు. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో సాలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తమ కుమారుడు అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం కొట్టక్కికి చెందిన పశువుల కాపరి చెట్టు కింద కుళ్లిపోయి దుర్వాసన కొడుతూ కింద పడి ఉన్న మృతదేహాన్ని చూసి గ్రామ వీఆర్వో మహేష్‌కు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు వీఆర్వో పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.ఎ సమాచారం అందిన వెంటనే సీఐ కె.నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావు, ఏఎస్సై అప్పారావులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద పడి ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా జీగిరాం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి బ్యాగుతో పాటు అందులో ఉన్న బట్టల ఆధారంగా తమ కుమారుడేనని గుర్తించి భోరున విలపించారు. మృతదేహం తీయలేని దుస్థితిలో ఉండడం వల్ల పోలీసు అధికారులు ఘటనా స్థలంలోనే బాడంగి సీహెచ్‌సీ వైద్యాధికారితో పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబసభ్యుల సమక్షంలో అక్కడే ఖననం చేశారు. ఎస్సై వి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగాలి

• జిల్లావ్యాప్తంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలి
• కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెరగాలని, గురువారం జిల్లావ్యాప్తంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డిజిటల్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ సూపర్ వైజర్లు, వీఆర్ఓలు, ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనాలని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 4,132 మంది 1వ తరగతి విద్యార్థులు తక్కువగా ఉన్నారని, అవన్నీ ఈ డ్రైవ్ ద్వారా భర్తీ కావాలని తేల్చిచెప్పారు. ఇప్పటికే పాఠశాలల్లో చేరి ఆన్‌లైన్‌లో నమోదు కాని వారి వివరాలను రానున్న రెండు రోజుల్లో పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఇందుకు తల్లితండ్రులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించాలని, డ్రాపౌట్ విద్యార్థులను కూడా బడిలో చేర్పించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తల్లికి వందనం కార్యక్రమంపై విద్యాశాఖాధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో పాటు అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్లు పెరగాలని, ఆ దిశగా తల్లితండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి బి.రాజ్‌కుమార్, నోడల్ అధికారి డి.మంజులవాణి, ఐసీడీఎస్ పీడీ డా.టి.కనకదుర్గ, ఎంఈఓలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

27న సుపరిపాలన కార్యక్రమం

సుపరిపాలన కార్యక్రమం ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. 27వ తేదీ ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.మన్మథ రావు, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా విపత్తు స్పందన/అగ్నిమాపక అధికారి పి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.